

TGTEL/26/A2094

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM


ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 285 | హైదరాబాద్ | సోమవారం | 23-03-2026 | పేజీలు: 08


## కాంగ్రెస్‌కు వీడ్కోలు దిశగా

# జీవన్ రెడ్డి

### 25న రాజీనామా చేయనున్నట్లు ప్రకటన



- పార్టీ కార్యకర్తలకు బహిరంగ లేఖ విడుదల
- కొన్ని నెలలుగా మానసిక ఒత్తిడిలో ఉన్నానని వ్యాఖ్య
- అవమానాలు భరించలేక తప్పుకుంటున్నానని వెల్లడి
- రాజీనామా తర్వాత స్థానిక నేతలతో చర్చలు
- భవిష్యత్ రాజకీయాలపై త్వరలో నిర్ణయం
- ఇతర పార్టీల ఆహ్వానాలపై ఆసక్తికర చర్చలు
- జగిత్యాల రాజకీయాల్లో కొత్త పరిణామాలకు తెర

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఆయన పార్టీ కార్యకలాపాలపై అసంతృప్తిగా ఉన్నారన్న వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రకటన మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.జగిత్యాల ప్రాంతానికి చెందిన ఈ నేత, పార్టీ కార్యకర్తలకు రాసిన బహిరంగ లేఖలో తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ నెల 25న అధికారికంగా

..మిగతా 2లో



## రైతు సంక్షేమం విషయంలో

# రాజీపడబోము

- గత పాలనకంటే రైతులకు ఎక్కువ మేలు చేస్తున్నాం
- రైతుభరోసా కింద ఎకరాకు 12 వేలు ఇస్తున్నాం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో ఇబ్బందికరంగా ఉంది
- అయినప్పటికీ రాజీపడకుండా రైతులకు సాయం చేస్తున్నాం
- రాష్ట్రంలో సారవంతమైన నేలలు ఉన్నాయి
- రైతులు అన్ని రకాలైన పంటలు పండించాలి
- రాజకీయంగా ఎవరిమీద వివక్ష లేదు
- అందుకే సిద్ధిపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించాం
- లేదంటే నా నియోజకవర్గానికి తరలించుకుపోయేవాన్ని కదా
- హరీశ్ రావు ను ఈ నియోజకవర్గంలో ఓడించాలి
- ఓడిస్తే వచ్చే క్యాబినెట్‌లో మంత్రి పదవి ఇస్తాం
- సిద్ధిపేట జిల్లా నర్మెట్ట బహిరంగసభలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ఆయన విడుదల చేశారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహించిన సభలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి, రైతులకు ఆర్థికంగా బలం చేకూర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం కింద మొత్తం 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించేందుకు ప్రభుత్వం రూ.9 వేల కోట్లను కేటాయించింది. తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం నుంచే ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు. తదుపరి విడతల్లో ఇరవై రోజుల

..మిగతా 2లో

## భవన నిర్మాణ రంగంలో

# సవరణలు

- టీడీఆర్ నిబంధనల్లో భారీ సడలింపులు
- బిల్డర్లు, డెవలపర్లకు ఉపశమనమిచ్చే నిర్ణయాలు
- హై-రైజ్ భవనాల నిర్వచనంలో మార్పులు
- టీడీఆర్ వినియోగంపై కొత్త శాతం విధానం
- సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు
- నిర్మాణ రంగానికి ఊతమిచ్చే ప్రభుత్వ లక్ష్యం


03

# కాంగ్రెస్ సర్కార్‌తో కష్టాలు

- రుణమాఫీ కాక, రైతుభరోసా రాక రైతుల తిప్పలు
- రైతు తుడుం గణపతిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రైతు తుడుం గణపతిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యనేనని ఆరోపించారు. గణపతి ఆత్మహత్యపై 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ఆదివారం స్పందించారు. రాష్ట్రంలో రైతుబంధు పాలన పోయి రాబందుల పాలన వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటను కాంగ్రెస్ సర్కార్ కొనకపోవడంతో నానాకష్టాలు

..మిగతా 2లో





# రైతు భరోసా

# నిధులు విడుదల

- తొలి విడతగా రూ.3,600 కోట్లు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- 70 లక్షల రైతుల ఖాతాలకు తొలి విడత నిధులు
- సోమవారం నుంచి బ్యాంక్ ఖాతాల్లో జమ ప్రారంభం
- దశలవారీగా మొత్తం రూ.9,000 కోట్ల పంపిణీ
- రైతును ఆర్థికంగా బలపరచడమే ప్రభుత్వ లక్ష్యం
- సిద్దిపేటలో రైతు ఉత్సవాలకు సీఎం హాజరు
- పామాయిల్ సాగుకు ప్రోత్సాహం – కొత్త ఫ్యాక్టరీ ప్రారంభం
- పంటల మార్పిడితో ఆదాయం పెంచాలని సూచన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం మరో ముఖ్యమైన అడుగు వేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం కింద భారీ మొత్తంలో నిధులను విడుదల చేశారు. తొలి విడతగా లక్షలాది మంది రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమ చేయడానికి

..మిగతా 2లో

# భూములు గుంజుకుంటే ఊరుకోం

- ఎకరం లాక్కొని.. 400 గజాలు ఇస్తారా?
- ల్యాండ్ పూలింగ్ స్కీం రూపకర్త కేసీఆరే
- గత సర్కార్‌లా చేస్తే.. ఈ ప్రభుత్వం పని ఖతం
- ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ సర్కార్ పేదల ఇండ్లను గుంజుకుంటే చూస్తూ ఊరుకోబోమని మల్కాజిగిరి ఎంపీ

..మిగతా 2లో



# భారత్‌కు భారీ ఎల్పీజీ దిగుమతులు

- మంగళూరుకు చేరిన భారీ ట్యాంకర్
- అంతర్జాతీయ ఉద్రిక్తతలతో గ్యాస్ కొరత
- గృహ, వ్యాపార రంగాలపై తీవ్ర ప్రభావం
- హోటళ్లు మూసివేత దశకు చేరిన పరిస్థితులు
- మంగళూరు పోర్టుకు భారీ ఎల్పీజీ ట్యాంకర్ చేరిక
- ఇతర పోర్టులకు వరుసగా చేరుతున్న కార్గో నౌకలు
- ప్రాధాన్యత రంగాలకు దశలవారీగా సరఫరా
- మరిన్ని దిగుమతులతో పరిస్థితి మెరుగయ్యే అవకాశం




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

దేశంలో వంటగ్యాస్ సరఫరాపై అంతర్జాతీయ పరిణామాల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇంధన సరఫరా గొలుసును దెబ్బతీశాయి. దాని ప్రభావం ఇప్పుడు భారతదేశంలో స్పష్టంగా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో

..మిగతా 2లో

# కాంగ్రెస్‌కు వీడ్కోలు దిశగా జీవన్ రెడ్డి



మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పనున్నట్లు స్పష్టం చేశారు.

**కార్యకర్తలకు లేఖ – స్పష్టమైన సంకేతం**

జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని ముందుగా పార్టీ కార్యకర్తలకు తెలియజేయడం విశేషం. బహిరంగ లేఖ ద్వారా ఆయన తన మనసులోని భావాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో ఇక కొనసాగడం సాధ్యం కాదని స్పష్టంగా పేర్కొన్నారు.ఈ లేఖలో ఆయన వ్యక్తిగతంగా ఎదుర్కొన్న పరిస్థితులను వివరించారు. పార్టీ కార్యకర్తలతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, భవిష్యత్తులో కూడా వారి మద్దతు అవసరమని కోరారు.

**మానసిక ఒత్తిడి, అసంతృప్తి**

గత కొంతకాలంగా తాను తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నానని జీవన్ రెడ్డి వెల్లడించారు. దాదాపు 20 నెలలుగా పార్టీ అంతర్గత పరిస్థితులు తనను కలవరపెడుతున్నాయని తెలిపారు.పార్టీలో తనకు సరైన ప్రాధాన్యం లభించడం లేదని, అనేక సందర్భాల్లో నిర్లక్ష్యం ఎదురైందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కొనసాగడం కష్టమైందని స్పష్టం చేశారు.

**అవమానాలు భరించలేక నిర్ణయం**

పార్టీలో అవమానాలు ఎదుర్కొంటూ కొనసాగడం సాధ్యం కాదని జీవన్ రెడ్డి తేల్చి చెప్పారు. రాజకీయాల్లో స్వాభిమానానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.తనకు ఎదురైన అనుభవాల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. పార్టీకి తన సేవలు అందించినప్పటికీ తగిన గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**రాజీనామా తర్వాత కార్యాచరణ**

రాజీనామా చేసిన తర్వాత తన తదుపరి కార్యాచరణపై స్పష్టత ఇస్తానని జీవన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా జగిత్యాల ప్రాంతంలో స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో అందరి అభిప్రాయాలు తెలుసుకుని, తదుపరి రాజకీయ నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. కార్యకర్తల సూచనలకు ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు.

**భవిష్యత్ రాజకీయాలపై ఆసక్తి**

జీవన్ రెడ్డి భవిష్యత్ రాజకీయాలపై ఇంకా పూర్తి స్పష్టత ఇవ్వకపోయినా, త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. ఆయన ఏ పార్టీ వైపు అడుగులు వేస్తారన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.ప్రస్తుతం వివిధ పార్టీల నుంచి ఆయనకు ఆహ్వానాలు వస్తున్నట్లు సమాచారం. అయితే తుది నిర్ణయం కార్యకర్తలతో చర్చించిన తర్వాత తీసుకుంటానని చెప్పారు.

**ఇతర పార్టీల ప్రయత్నాలు**

ఇదిలా ఉండగా, జీవన్ రెడ్డిని తమ పార్టీలోకి తీసుకురావడానికి ఇతర రాజకీయ పార్టీలు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ నేతలు ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ చర్చలు ఎంతవరకు సఫలమవుతాయన్నది ఆసక్తికరంగా మారింది. మరో రెండు మూడు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

**జగిత్యాల రాజకీయాల్లో మార్పులు**

జీవన్ రెడ్డి నిర్ణయం జగిత్యాల రాజకీయాల్లో కొత్త మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. ఆయనకు స్థానికంగా ఉన్న బలమైన అనుచర వర్గం కారణంగా ఈ పరిణామం ప్రభావం చూపే అవకాశముంది. పార్టీ మార్పు జరిగితే స్థానిక రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పరిణామాలు మరింత వేగంగా మారే అవకాశముంది. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన తదుపరి నిర్ణయం ఏ దిశగా ఉంటుందన్నదానిపై అందరి దృష్టి నిలిచింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# భూములు గుంజుకుంటే ఊరుకోం

మొదటిపేజీ తరువాయి

ఈటల రాజేందర్ విమర్శించారు. ఆదివారం ఆయన కోహెడ భూబాధితుల సంఘం ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, కోహెడ గ్రామంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు భూతల్లిని నమ్ముకుని నివసిస్తున్నారని, నాలుగు తరాలుగా ఆ భూములను దున్నుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వారికి ఆనాటి ప్రభుత్వాలు ఎంక్వైరీ చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. 12 సంవత్సరాల పైబడి పేదలు భూములపై జీవనం కొనసాగిస్తే ఆ భూములను ముట్టుకునే అధికారం ఎవరికీ ఉండదని గుర్తుచేశారు. రింగ్ రోడ్డు నిర్మాణ సమయంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు కూడా డబ్బులు ఇచ్చి తీసుకోవాలని తాము డిమాండ్ చేశామని, ఆ సమయంలో అసైన్డ్ భూముల వారికి కూడా డబ్బులు వచ్చాయని ఈటల గుర్తుచేశారు. అసైన్డ్ భూములు అమ్ముకునే అధికారం లేదు కానీ అనుభవించే అధికారం శాశ్వతంగా ఉంటుందని పేర్కొన్నారు. గవర్నమెంట్ అంటే ఎవడబ్బ జాగీర్ కాదని, గవర్నమెంట్ అంటే తెలంగాణ ప్రజలని ఆయన వ్యాఖ్యానించారు. బయట రాష్ట్రాల్లో 1520 ఏళ్ల అసైన్డ్ భూములపై జీవనం సాగించినవారికి ఆ భూములను అమ్ముకునే అధికారం కల్పించారని ఈటల వివరించారు. కానీ, కేసీఆర్ వచ్చాక ఒక దరిద్రపు స్కీమ్ తీసుకొచ్చారని, అదే ల్యాండ్ పూలింగ్ అని రాజేందర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దాని పేరుతో ఒక ఎకరం లాక్కుని 400 గజాలు ఇచ్చారని, ప్రభుత్వానికి భూమి ఎక్కడ అవసరం వచ్చినా పేదల భూమి మాత్రమే ఎందుకు గుంజుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. గవర్నమెంట్ భూములు లేవా? అని నిలదీశారు. ఆనాడు కేసీఆర్ ఈ భూములు లాక్కుని 300 గజాల చొప్పున ఇస్తానని చెప్పి ఇప్పటికీ ఇవ్వకుండా పేదల కళ్ళల్లో మట్టి కొట్టాడని ధ్వజమెత్తారు. ఇకపోతే ఇందిరమ్మ రాజ్యమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ కూడా అదే చేస్తున్నదన్నారు. షావుకారు గుట్టలకు సంబంధించిన భూములకు పరిహారం ఇవ్వకపోతే ప్రభుత్వ భరతం పడతామని ఈటల హెచ్చరించారు. అది చాలక మార్కెట్ కోసం కోహెడలో 159 మంది రైతులు సాగు చేస్తున్న 239 ఎకరాలు భూములను తీసుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని వార్నింగ్ ఇచ్చారు. పోలీసులు.. ప్రజలు, పేదలకు న్యాయం, ధర్మం చేయాలి తప్పితే దౌర్జన్యం చేయొద్దని సూచించారు. పాత షావుకారు గుట్టలకు ఎలా పరిహారం అందించారో.. ఇప్పుడు కూడా అలాగే అందించాలని డిమాండ్ చేశారు. కోహెడ గుట్టలను లాక్కునే ప్రయత్నం చేయొద్దని స్పష్టంచేశారు. కలెక్టర్ నారాయణ రెడ్డి.. వెంటనే స్పందించి సీఎంతో చర్చలు జరిపి కోహెడ గుట్టల పేదల భూములకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారం ఉందని విర్రవీగితే గత సీఎం కేసీఆర్ ఫ్యూజులు పీకారని, అలాగే విర్రవీగితే కాంగ్రెస్ సర్కార్ ఫ్యూజు కూడా పీకడం ఖాయమని హెచ్చరించారు.




# రైతు సంక్షేమం విషయంలో రాజీపడబోము

మొదటిపేజీ తరువాయి

వ్యవధిలో రెండో విడతగా రూ.2,650 కోట్లు, మూడో విడతగా రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నట్లు వివరించారు. రైతులకు సమయానికి నిధులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కొన్ని ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ రైతుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. వరి పంటకు ప్రోత్సాహకంగా అదనపు ధనసహాయం అందిస్తున్నామని, వరదల వల్ల పంటలు నష్టపోతే పరిహారం కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.1.40 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు దీర్ఘకాలంలో మంచి ఫలితాలను ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పంటల విధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులు పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని సూచించారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో విస్తృతంగా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు సాగు చేసేవారని, ప్రస్తుతం భూసంపదను నిర్మాణ రంగానికి మళ్లించడం వల్ల ఆ పంటల సాగు తగ్గిపోయిందని తెలిపారు. దాంతో ఇతర రాష్ట్రాల నుంచి ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రైతులు విభిన్న పంటలను సాగు చేయాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వం వరి కొనుగోలు పరిమితిని నిర్ణయించడం వల్ల రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా ఇతర పంటలను కూడా సాగు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పంట మార్పిడి ద్వారానే వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని చెప్పారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అక్కడి రైతులు ఆధునిక విధానాలను అనుసరించి అధిక ఆదాయం సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి జిల్లా ఒక ప్రత్యేక పంటకు ప్రసిద్ధి చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

రాష్ట్రంలో సారవంతమైన భూములు, కష్టపడే రైతులు ఉన్నందున వ్యవసాయ రంగంలో పెద్ద అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పంటలను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రైతుల ఆదాయం పెరగడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. మహిళా సాధికారతపై కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను ఆర్థికంగా బలపరచి వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మహిళలను వ్యాపార రంగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఒకప్పుడు పెద్ద వ్యాపారవేత్తలు మాత్రమే చేపట్టే సౌర విద్యుత్ రంగంలో ఇప్పుడు మహిళలు కూడా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళల ద్వారా సౌర విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

విద్యా రంగంలో ప్రభుత్వం చేపడుతున్న మార్పులను కూడా ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్న తరగతుల నుంచే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.



రాజకీయ అంశాలపై మాట్లాడుతూ, ఎన్నికల సమయంలోనే రాజకీయ పోటీ ఉండాలని, మిగతా సమయంలో అభివృద్ధి కోసం అన్ని వర్గాలు కలిసికట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రత్యర్థి పార్టీల నేతలతో రాజకీయ భేదాలు ఉండొచ్చుగానీ, ప్రజల అభివృద్ధి విషయంలో వివక్ష ఉండకూడదన్నారు. అన్ని ప్రాంతాలకు సమానంగా నిధులు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు.

రాబోయే ఎన్నికల్లో సిద్ధిపేటలో కాంగ్రెస్ విజయం సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, అక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గతంలో కొన్ని ప్రాంతాలకు అన్యాయం జరిగిందని విమర్శిస్తూ, తాను అలాంటి విధానాన్ని అనుసరించబోనని అన్నారు. ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమానికి ముందు నర్మెటలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ పరిశ్రమను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో ఈ పరిశ్రమ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదనంగా రూ.80 కోట్లతో పామాయిల్ శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వ్యవసాయానికి కూడా తోడ్పాటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొత్తంగా రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, మహిళా సాధికారత, విద్యా రంగంలో మార్పులు, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చే దిశగా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌తో కష్టాలు

మొదటిపేజీ తరువాయి



పడుతున్న రైతన్నల గోడు తెలుసుకునేందుకు గతేడాది నవంబర్ 18న తాను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌కు వెళ్లానని గుర్తు చేశారు. అంతకు ముందురోజే మీడియాతో ఆదిలాబాద్ జిల్లా ఆర్లీ(బీ)కి గ్రామానికి చెందిన తుడుం గణపతి తన కష్టాలు చెప్పుకుంటూ కళ్లనీళ్ల పర్యంతం అయ్యాడని, నాలుగు రోజులుగా మార్కెట్ యార్డులో ఉంటున్నా తన సోయాబీన్ పంటను కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇట్లాగే పంటను కొనకుండా వేధిస్తే, తనకు మరణం తప్ప మరోమార్గం లేదని రోదించాడని తెలిపారు. రుణమాఫీ కాక, రైతుభరోసా రాక, అప్పుల బాధ తీవ్రమై మూడు రోజుల క్రితం గణపతి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అయితే, ఇది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆగ్రహం వ్యక్త చేశారు.

# భారత్‌కు భారీ ఎల్పీజీ దిగుమతులు

మొదటిపేజీ తరువాయి




వంటగ్యాస్ కొరత ఏర్పడి సాధారణ ప్రజల నుంచి వ్యాపార వర్గాల వరకు అందరినీ ఇబ్బందులకు గురిచేస్తోంది. డొమెస్టిక్ వినియోగదారులు మాత్రమే కాకుండా కమర్షియల్ వినియోగదారులు కూడా ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా హోటళ్లు, చిన్న వ్యాపారాలు గ్యాస్ కొరత కారణంగా తమ కార్యకలాపాలను తగ్గించుకోవాల్సి వస్తోంది. కొన్ని చోట్ల తాత్కాలికంగా హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడుతున్నారు. కొన్ని చోట్ల ఎలక్ట్రిక్ స్టౌలు, మరికొన్ని చోట్ల వుడ్ లేదా ఇతర ఇంధనాల వినియోగం పెరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే మరింత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలు త్వరగా సరిదిద్దకపోతే గ్యాస్ కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో దేశానికి ఉపశమనం కలిగించేలా భారీ ఎల్పీజీ సరుకు దేశానికి చేరుతోంది. అమెరికా నుంచి బయలుదేరిన ఒక భారీ కార్గో నౌక ఇటీవల మంగళూరు న్యూ పోర్ట్‌కు చేరుకుంది. పైక్సిస్ పయనీర్ పేరుతో ఉన్న ఈ నౌక సుమారు 72,700 టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌ను తీసుకువచ్చింది. ఈ సరుకు చేరుకోవడం ప్రస్తుత గ్యాస్ కొరతను కొంతవరకు తగ్గించడంలో సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు. నౌక పోర్ట్‌లోని 13వ బెర్త్ వద్ద నిలిపి, గ్యాస్ అన్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభించారు.

ఈ నౌక సింగపూర్ జెండా కింద నడుస్తున్నదిగా సమాచారం. అమెరికాలోని టెక్సాస్ ప్రాంతం నుంచి ఈ గ్యాస్ సరుకు లోడ్ చేసి భారతదేశానికి తీసుకొచ్చారు. ఇందులోని గ్యాస్‌ను వివిధ సంస్థలకు కేటాయించనున్నారు. ముఖ్యంగా ఏజిస్ లాజిస్టిక్స్ వంటి సంస్థలకు కొంత భాగం సరఫరా చేయబడుతుంది. ఈ సరుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేయబడుతూ గ్యాస్ కొరతను తగ్గించే ప్రయత్నం జరుగుతోంది.

ఇదిలా ఉండగా, ఇటీవల మరికొన్ని భారీ ట్యాంకర్లు కూడా దేశానికి చేరాయి. ముందుగా ముంద్రా పోర్ట్‌కు ముడి చమురు మరియు ఎల్పీజీతో కూడిన నౌకలు చేరాయి. అలాగే వడినార్ పోర్ట్‌కు కూడా భారీ ఎల్పీజీ సరుకు తీసుకొచ్చిన నౌకలు చేరినట్లు సమాచారం. ఈ సరుకులతో కలిపి దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఇప్పటికే దేశానికి అందింది. ఇప్పుడు మంగళూరుకు చేరిన ఈ తాజా సరుకుతో మొత్తం సరఫరా మరింత పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మంగళూరులో అన్‌లోడ్ చేసిన గ్యాస్‌ను హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వంటి సంస్థల ద్వారా ప్రాసెస్ చేసి దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపిణీ చేస్తారు. ఈ గ్యాస్‌ను బాట్లింగ్ ప్లాంట్లకు తరలించి, అక్కడి నుంచి గృహ వినియోగదారులకు, కమర్షియల్ వినియోగదారులకు సరఫరా చేస్తారు. మంగళూరు నుంచి బెంగళూరు వరకు ఉన్న ఎల్పీజీ పైప్‌లైన్ ద్వారా కూడా గ్యాస్ సరఫరా జరుగుతుంది. ఈ విధంగా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# రైతు భరోసా నిధులు విడుదల

మొదటిపేజీ తరువాయి

చర్యలు ప్రారంభించారు.ఈ చర్యతో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, సాగు పనులకు ముందస్తు మద్దతు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

**తొలి విడతలో 70 లక్షల రైతులకు లాభం**

ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత నిధుల ద్వారా సుమారు 70 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా ఒక ఎకరం వరకు భూమి కలిగిన రైతులకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిధులను జమ చేస్తున్నారు.ఈ విడతలో మొత్తం రూ.3,600 కోట్లను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆదివారం రోజు కావడంతో బ్యాంకింగ్ ప్రక్రియలు పూర్తికాకపోవడంతో, ఈ నిధులు రైతుల ఖాతాల్లో సోమవారం నుంచి జమ అవుతాయి.

**దశలవారీగా మొత్తం నిధుల పంపిణీ**

రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం మొత్తం రూ.9,000 కోట్లను రైతులకు అందించనుంది. తొలి విడతగా విడుదలైన రూ.3,600 కోట్ల తర్వాత, మిగతా మొత్తాన్ని రెండు దశల్లో జమ చేస్తారు.ప్రతి దశలో సుమారు రూ.2,700 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయనున్నారు. ఈ ప్రక్రియ వచ్చే 20 రోజుల వ్యవధిలో పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

**సిద్దిపేటలో సీఎం పర్యటన**

ఈ కార్యక్రమానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించారు. నర్మెట్టలో జరిగిన రైతు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన సీఎం, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి పనిచేస్తోందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి**

రైతులను ఆర్థికంగా బలపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. రైతు భరోసా నిధులను గతంతో పోలిస్తే పెంచినట్లు ఆయన తెలిపారు.పంటలకు కనీస మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని వెల్లడించారు. రైతుల ఆదాయం పెంచేందుకు అన్ని విధాలుగా సహకరిస్తున్నామని చెప్పారు.

**భారీ ఖర్చులతో పథకాల అమలు**

రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ మొత్తాలను ఖర్చు చేస్తోందని సీఎం పేర్కొన్నారు. ప్రతి నెలా రైతుల కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు.గత 20 నెలల్లో రైతుల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయడం ద్వారా రైతులకు నష్టాలు లేకుండా చూస్తున్నామని చెప్పారు.

**పామాయిల్ సాగుకు ప్రోత్సాహం**

రైతుల ఆదాయం పెంచేందుకు పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. ఇందుకోసం భారీ పెట్టుబడులతో పామాయిల్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ప్రారంభించిన ఫ్యాక్టరీతో పాటు, మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పామాయిల్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**పంటల మార్పిడిపై దృష్టి**

రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా, పంటల మార్పిడిని అనుసరించాలని సీఎం సూచించారు. వరి సాగుతో పాటు ఇతర పంటలపై కూడా దృష్టి పెట్టాలని కోరారు.మిల్లెట్స్, ఆకు కూరలు, పామాయిల్ వంటి పంటలు సాగు చేస్తే మంచి ధర లభిస్తుందని తెలిపారు. పంటల వైవిధ్యం ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.

**గ్రామీణ అభివృద్ధిపై దృష్టి**

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఆదర్శ గ్రామాలుగా గుర్తింపు పొందిన ప్రాంతాల మాదిరిగా అన్ని గ్రామాలు ఎదగాలని ఆకాంక్షించారు.రైతుల ఆదాయం పెరిగి, వారు ఆర్థికంగా బలపడాలని కోరుకున్నారు. ప్రతి రైతు సుఖసంతోషాలతో జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.రైతు భరోసా నిధుల విడుదలతో తెలంగాణలో వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభించనుంది. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు రైతులకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా ఉండటంతో, ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన పొందుతోంది. రైతుల ఆదాయం పెంపు, సాగు వ్యయాల తగ్గింపు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.



# ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన పత్తేపు యాదగిరి గుండె మరియు కిడ్నీ సమస్యతో చాలా రోజుల నుండి బాధపడుతూ అనారోగ్యంతో మరణించారు.వారి యొక్కకుటుంబ సభ్యులకి (AJR ఫౌండేషన్) ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో (5000 వేల రూపాయలు)అందజేశారు.గ్రామ ప్రముఖులు గ్రామ గ్రామ ప్రముఖులు,యువత పాల్గొన్నారు.



# ప్రభుత్వ విప్ వేముల వీరేశంను కలిసిన ఉద్యమకారులు

**వలిగొండ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ను ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారుడు కాంబ్లి శ్రీధర్. మంచి రమేష్ మంచి శేఖర్ షేక్ అజ్జు తదితరులు పాల్గొన్నారు.



# గ్రానైట్ లారీల అక్రమాలు ఆగట్లేదు

- **ప్రజల ప్రాణాలకు ముప్పు.**
- **ప్రాణాలపై పరిగెత్తుతున్న భారీ లారీలు.**
- **స్థానికుల్లో తీవ్ర ఆందోళన.**

**కరీంనగర్,మార్చి 22 (ప్రజాక్షేత్రం) :**

శంకరపట్నం మండలంలో గ్రానైట్ తవ్వకాలు నియంత్రణ లేకుండా కొనసాగుతున్నాయి. అనుమతుల పరిమితులను అతిక్రమిస్తూ సాగుతున్న తవ్వకాలతో పాటు, రాళ్ల రవాణా కోసం తిరిగే భారీ లారీలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలకు కారణమవుతున్నాయి. ఆదివారం జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు, అతివేగంగా దూసుకెళ్తున్న గ్రానైట్ లారీలను చూసి ప్రాణభయంతో వణికిపోయారు. లారీల్లో లోడైన రాళ్లు ఎప్పుడు జారిపడతాయోననే ఆందోళనతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాంటి భద్రతా చర్యలు పాటించకుండా, నియంత్రణ లేకుండా దూసుకెళ్తున్న ఈ వాహనాలు రహదారులపై ప్రయాణించే సాధారణ ప్రజలకు ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు పణంగా పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. గ్రానైట్ రవాణా పేరుతో నిబంధనలు బేఖాతరు చేస్తూ జరుగుతున్న ఈ అక్రమ కార్యకలాపాలపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లారీల వేగ నియంత్రణతో పాటు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# కలెక్టర్ వెంకటనర్సింహారెడ్డి మూసీ రివర్ ఎండీ ఈవిఎన్ క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత

**ప్రజాక్షేత్రం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

బుద్ధ నాగరాజు చోరువతో కలెక్టర్ వెంకట నర్సింహారెడ్డి మూసీ రివర్ ఎండి ఈవిఎన్ జగదేవపూర్ క్రికెట్ క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గ్రామీణ ప్రాంతల నుండి ఎదిగి గ్రామనికి పేరు ప్రాక్యతలు తీసుకురావాలని తల్లి దండ్రులు పేరు నిలబెటలని అన్నారు.ఈ కార్యక్రమంలో బుద్ధ బాల్ నారాయణ బుద్ధ సత్యం, క్రీడాకారులు బత్తిని శ్రీనివాస్, పనగట్ల వంశీ భాస్కర్, ప్రశాంత్, ఉగ్రి సందీప్ ,వంశీ, కన్ని తదితరులు ఉన్నారు.



# భవన నిర్మాణ రంగంలో సవరణలు

- **టీడీఆర్ నిబంధనల్లో భారీ సడలింపులు**
- **బిల్డర్లు, డెవలపర్లకు ఉపశమనమిచ్చే నిర్ణయాలు**
- **హై-రైజ్ భవనాల నిర్వచనంలో మార్పులు**
- **టీడీఆర్ వినియోగంపై కొత్త శాతం విధానం**
- **సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు**
- **ప్లాట్ పరిమాణం ఆధారంగా ఎత్తు అనుమతులు**
- **రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తులకు అవకాశం**
- **నిర్మాణ రంగానికి ఊతమిచ్చే ప్రభుత్వ లక్ష్యం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని మరింత చురుకుగా మార్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమివ్వడంతో పాటు, గతంలో అమల్లో ఉన్న కొన్ని కఠిన నిబంధనలను సడలిస్తూ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ముఖ్యంగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) వినియోగంపై పెద్ద ఎత్తున మార్పులు చేస్తూ, నిర్మాణ రంగానికి మరింత సౌలభ్యం కల్పించింది.మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మార్పులను అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమల్లోకి రానున్నాయి. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన ప్రాజెక్టులు తిరిగి ప్రారంభమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**బిల్డర్లకు ఉపశమనం**

ఇప్పటివరకు టీడీఆర్ వినియోగంపై అమల్లో ఉన్న కఠిన నిబంధనల వల్ల బిల్డర్లు, డెవలపర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా టీడీఆర్‌ను ఒకేసారి సమర్పించాల్సిన అవసరం, అధిక శాతం విధానం వంటి అంశాలు ప్రాజెక్టుల ఆలస్యానికి కారణమయ్యాయి. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సడలింపులు ప్రకటించింది.ఇకపై టీడీఆర్‌ను ఒకేసారి సమర్పించాల్సిన అవసరం లేదు. మొత్తం టీడీఆర్‌లో 50 శాతం భవన నిర్మాణ అనుమతి తీసుకునే సమయంలో సమర్పిస్తే సరిపోతుంది. మిగిలిన 50 శాతం భవనం పూర్తయిన తర్వాత, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తీసుకునే ముందు సమర్పించవచ్చు. ఈ విధానం వల్ల బిల్డర్లపై ఆర్థిక భారం తగ్గనుంది.

**హై-రైజ్ భవనాల కొత్త నిర్వచనం**

భవనాల ఎత్తు విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత తీసుకువచ్చింది. ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే హైరైజ్ భవనాలుగా పరిగణిస్తారు. అయితే ఈ ఎత్తు లెక్కించేటప్పుడు కొన్ని నిర్మాణ భాగాలను పరిగణలోకి తీసుకోరు. ఉదాహరణకు చిమ్నీలు, వాటర్ ట్యాంకులు, లిఫ్ట్ మెషిన్ రూమ్‌లు, బాయిలర్ గదులు వంటి వాటి ఎత్తు భవనం మొత్తం ఎత్తులో లెక్కించబడదు. దీని వల్ల నిర్మాణ ప్రణాళికలో స్పష్టత ఏర్పడుతుంది.

**టీడీఆర్ వినియోగంపై కొత్త విధానం**

టీడీఆర్ వినియోగంపై ప్రభుత్వం గతంలో అమల్లో ఉన్న 10 శాతం నిబంధనను సవరించింది. భవనాల అంతస్తుల సంఖ్య ఆధారంగా కొత్త శాతం విధానాన్ని అమలు చేస్తోంది. 10 నుంచి 20 అంతస్తుల మధ్య ఉన్న భవనాలకు, 10వ అంతస్తు పై భాగంలో ఉన్న నిర్మాణ విస్తీర్ణంలో కేవలం 3 శాతం టీడీఆర్ వినియోగిస్తే సరిపోతుంది. ఇదే సమయంలో 21 అంతస్తులకుపైగా ఉన్న భవనాలకు 20వ అంతస్తు పైభాగంలో ఉన్న విస్తీర్ణంలో 5 శాతం టీడీఆర్ వినియోగం తప్పనిసరి చేసింది. ఈ మార్పులు పెద్ద భవనాల నిర్మాణాన్ని సులభతరం చేస్తాయని భావిస్తున్నారు.

**సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు**

సెట్ బ్యాక్ నిబంధనల్లో కూడా ప్రభుత్వం కొన్ని సడలింపులు ఇచ్చింది. హైరైజ్ భవనాల్లో గరిష్టంగా 10 శాతం వరకు సెట్ బ్యాక్ తగ్గించుకునే అవకాశం కల్పించింది. అయితే భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల ఖాళీ స్థలం ఉండాలనే నిబంధన మాత్రం యథాతథంగా కొనసాగుతుంది.నాన్ హైరైజ్ భవనాలకు కూడా టీడీఆర్ వినియోగం ద్వారా ఇలాంటి సడలింపులు వర్తిస్తాయి. దీని వల్ల స్థల వినియోగం మరింత సమర్థవంతంగా మారుతుంది.



**ప్లాట్ పరిమాణం ఆధారంగా ఎత్తు అనుమతులు**

ప్లాట్ పరిమాణాన్ని బట్టి భవనాల ఎత్తుకు సంబంధించి కూడా కొత్త మార్గదర్శకాలు అమల్లోకి వచ్చాయి. 750 చదరపు మీటర్ల నుంచి 2000 చదరపు మీటర్ల వరకు ఉన్న ప్లాట్లలో, 18 మీటర్ల నుంచి 21 మీటర్ల వరకు ఎత్తు పెంపు టీడీఆర్ ద్వారా మాత్రమే అనుమతిస్తారు.ఈ విధానం వల్ల చిన్న మరియు మధ్య తరహా ప్రాజెక్టులకు కూడా అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయి.

**రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తులు**

పెద్ద ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం కొత్త వెసులుబాటు కల్పించింది. 2000 చదరపు మీటర్లకు పైగా ఉన్న ప్లాట్లలో రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తులకు అనుమతి ఇస్తారు.40 అడుగుల రోడ్డు ఉన్న చోట మూడు అదనపు అంతస్తులు నిర్మించుకోవచ్చు. 60 అడుగుల రోడ్డు ఉంటే నాలుగు అంతస్తులు, 80 అడుగుల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న రోడ్డు పక్కన ఐదు అదనపు అంతస్తుల వరకు నిర్మాణానికి అనుమతి ఉంటుంది.ఈ మార్పులు నగరాల్లో భూమి వినియోగాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

**మాస్టర్ ప్లాన్ మార్పులకు కొత్త ఎంపిక**

మాస్టర్ ప్లాన్‌లో రోడ్ల మార్పులు లేదా తొలగింపులు జరిగితే, దరఖాస్తుదారులకు రెండు ఎంపికలు ఇవ్వబడ్డాయి. వారు నిర్ణీత ఛార్జీలు చెల్లించవచ్చు లేదా దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించవచ్చు.ఈ విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు, అభివృద్ధి పనులు కూడా సులభతరం అవుతాయి.

**నిర్మాణ రంగానికి ఊతం**

ఈ కొత్త మార్పులు రాష్ట్రంలో భవన నిర్మాణ రంగానికి పెద్ద ఊతంగా మారనున్నాయి. ముఖ్యంగా టీడీఆర్ అందుబాటులో లేక నిలిచిపోయిన ప్రాజెక్టులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు, ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. నగరాభివృద్ధి వేగవంతం కావడంతో పాటు, ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలకు ఈ మార్పులు దోహదపడతాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు నిర్మాణ రంగాన్ని సులభతరం చేయడంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించే దిశగా కీలక పాత్ర పోషించనున్నాయి. భవిష్యత్తులో తెలంగాణ నగరాలు మరింత ఆధునికంగా, సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు ఇవి దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు.

# అనాథలకు అండగా స్కై ఫౌండేషన్... 297వ అన్నదానం

**సికింద్రాబాద్,మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

నగరంలో ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచారజాతుల కుటుంబాలకు అండగా స్కై ఫౌండేషన్ పనిచేస్తోంది. సంస్థ ఆధ్వర్యంలో 297వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, అవసరమైన వారికి ఆహారం అందజేశారు.నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనంలో సంచరిస్తూ నిజంగా అవసరమైన వారిని గుర్తించి వారికి భోజనం అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా నిరంతరం కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు అఖిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు సంజీవ్ కుమార్, పావని మాట్లాడుతూ.. సమాజంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.



# వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించిన పోలీసులు

**సికింద్రాబాద్,మార్చి22 ( ప్రజాక్షేత్రం ):**

సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా సంచరిస్తున్న ఓ వృద్ధురాలిని పోలీసులు అండగా నిలిచి,ఆశ్రమంలో చేర్పించారు. రియల్ వివేక్ ఫౌండేషన్ నిర్వాహకుడు అంబులెన్స్ శ్రీనివాస్ గుప్తా తెలిపిన వివరాలు... చిలకలగూడ పీఎస్ పరిధిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు వెంటనే ఫౌండేషన్ వాహనంలో బోయిగూడ లోని మిషనరీ ఆఫ్ ఛారిటబుల్ ఆఫ్ ట్రస్ట్ ఆశ్రమానికి తీసుకెళ్ళి, అందులో చేర్పించారు. తనకు ఆశ్రయం కల్పించిన పోలీస్ సిబ్బంది, ఫౌండేషన్ శ్రీనివాస్ గుప్తాకు వృద్ధురాలు కృతజ్ఞతలు చెప్పింది.



# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వంటేరు ప్రతాప్ రెడ్డి





- **అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్ష**

**ప్రజాక్షేత్రం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని ముస్లిం సోదరులను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ రంజాన్ పండుగ క్రమశిక్షణకు సేవ భావానికి ప్రతికాగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రతి ఇంటికి సిరి సంపదలు సంతోషాలు విరాజిలాలని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ముస్లింలకు పెద్ద పీఠ వేసిందని ముస్లిం కోసం ఎన్నెన్నో సంక్షేమ పథకాలు ప్రావేశ పెట్టిందని అన్నారు. ముస్లింకు షాదీ మొబారక్ ద్వారా పేద ముస్లింకు అండగా నిలచ్చిందని అన్నారు. ఇమామ్ మసీదులకు వేతనాలు ఇచ్చామనిన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఉప సర్పంచ్ గణేష్ మాజీ ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజ్ నాయకులు చిలుకూరు మధుసూదన్ రెడ్డి వార్డ్ నెంబర్లు బతిని శ్రీనివాస్ ఎండి ఇస్మాయిల్ బచ్చలి భాస్కర్ మచ్చ బాబు డబ్బు సాయికుమార్ నాయకులు దాచారం కనకయ్య దండే భాస్కర్ నాగరాజ్ అడ్డు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# దోచుకున్నవాళ్లే ఇప్పుడు నీతులు చెబుతున్నారు.

- **గంజాయి మొక్కలాగా మారిన నేతలను ప్రజలే పీకేశారు.**
- **పెబ్బేరు సంత వివాదం పై ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఫైర్.**

**వనపర్తి,మార్చి 22 (ప్రజాక్షేత్రం):**
పెబ్బేరు సంత వివాదంపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. "దోచేయాలని చూసిన దొంగలే నేడు నీతిమంతుల్లా మాట్లాడటం విడ్డూరం" అంటూ మండిపడ్డారు. పెబ్బేరు సంత స్థలం విషయంలో దేవాదాయ శాఖ, పూజారుల మధ్య వివాదం నడుస్తోందని, కోర్టును గౌరవిస్తూ ఎవరికి అన్యాయం జరగకుండా పరిష్కారం చూపేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. "పెబ్బేరు సంతపై ఈగ కూడా వాలనివ్వకుండా కాపాడే బాధ్యత నాది" అని అన్నారు.

**"100 ఏళ్ల సంతను వివాదంలోకి నెట్టారు"**
వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన ఇనాం భూమిగా 100 ఏళ్లుగా కొనసాగుతున్న సంతను కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాస్పదం చేశారని ఆరోపించారు. 1973లోనే ఈ భూమి ఆలయానికి కేటాయించబడిందని, పూజారుల జీవనోపాధి కోసం ఉపయోగపడుతోందని తెలిపారు. "2014 వరకు ప్రశాంతంగా ఉన్న సంతను అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు వ్యక్తులు ప్లాన్ చేసి సమస్యగా మార్చారు" అంటూ తీవ్ర విమర్శలు చేశారు.

**"గిఫ్ట్ డీడ్లతో దోపిడీకి ప్రయత్నం".**
భూమిని మున్సిపాలిటీ పేరున కాకుండా ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. "మళ్లీ గెలుస్తాననే ఆశతో సంత స్థలాన్ని దోచుకునేందుకు ప్రయత్నించారు" అని అన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉందని, తీర్పు వచ్చిన తర్వాత ఎవరికైతే హక్కు వస్తుందో వారికి భూమి, పరిహారం ఇవ్వబడుతుందని చెప్పారు.
"అవసరమైతే ఆధారాలు బయటపెడతాం" ఎమ్మెల్యే తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ, "ఇంకా పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఒక్కోటి బయటపెడతాం" అన్నారు. సిమ్ కార్డులు పడేసినవాళ్లు ఎవరో ప్రజలకు తెలుసని, దొంగచాటుగా వ్యవహరించిన వాళ్లే ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.



**కాంగ్రెస్ విజయంపై వ్యాఖ్యలు.**
ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించిందని, ఆ ఫలితాలతో కొందరు మానసిక స్థైర్యం కోల్పోయారని అన్నారు. "మేమూ ఇదే నేలపై పుట్టాం... అవసరమైతే అదే భాషలో సమాధానం ఇస్తాం" అని హెచ్చరించారు.

**అభివృద్ధి కార్యక్రమాల ప్రస్తావన.**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కొత్త పెన్షన్లు వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.
"పెబ్బేరు సంత చివరి వరకు ప్రజలకే దక్కేలా పోరాడుతాం" అని ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పష్టం చేశారు. "దొంగలు నీతులు చెప్పే రోజులు పోయాయి.ప్రజలే తీర్పు చెబుతున్నారు" అంటూ ఘాటుగా ముగించారు.పత్రిక సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనరెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి,జిల్లా నాయకులు నాయకులు,కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## వనపర్తి అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం
# పన్నులు సకాలంలో చెల్లించాలి.

- **33 వార్డుల ప్రజలకు మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ విజ్ఞప్తి.**
- **ఇండ్లు,వాటర్ ట్యాక్స్ బకాయిలు చెల్లిస్తే సేవలు మరింత మెరుగుదల.**



**వనపర్తి,మార్చి 22(ప్రజాక్షేత్రం):**
వనపర్తి పట్టణాభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలంటే ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు పట్టణ ప్రజలకు ఒక ప్రకటన విడుదల చేశారు.పట్టణ పరిధిలోని 33 వార్డుల నందు నివాసం ఉన్న ప్రతి ఒక్కరు పెండింగ్‌లో ఉన్న పన్నులను వీలైనంత త్వరగా చెల్లించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రాపర్టీ ట్యాక్స్ (హౌస్ ట్యాక్స్), నల్లా ట్యాక్స్ (వాటర్ ట్యాక్స్), అలాగే వ్యాపార సముదాయాల లైసెన్స్ ఫీజులు మున్సిపాలిటీకి ముఖ్య ఆదాయ వనరులని, వీటి ద్వారా పట్టణంలో మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని వివరించారు. రహదారులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి సేవలను మరింత మెరుగుపరచేందుకు పన్నుల వసూళ్లు కీలకమని, ప్రజలు స్వచ్ఛందంగా తమ బాధ్యతగా పన్నులు చెల్లించాలని కోరారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో వనపర్తి ప్రత్యేక స్థానాన్ని సాధించాలంటే ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. పన్నులు సకాలంలో చెల్లించడం ద్వారా పట్టణ అభివృద్ధికి తోడ్పడినట్టవుతుందని, అందరూ ముందుకు వచ్చి మున్సిపాలిటీకి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలుగుదేశం ఆవిర్భావంతోనే వెలుగు బీజం.

- **మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు**
- **ఎన్టీఆర్,చంద్రబాబులతోనే రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రగతి.**
- **ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ముందుకు సాగుతాం.**
- **మూసినది ప్రక్షాళన ఓ మంచి కార్యక్రమం.**
- **సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు.**

**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 22(ప్రజాక్షేత్రం):**
తెలుగుదేశం ఆవిర్భావంతోనే వెలుగు బీజం పడిందని ఎన్టీఆర్, చంద్రబాబులతోనే రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రగతి పంచిందనీ తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో "బక్కని" మాట్లాడుతూ.. ఈనెల 29వ తారీఖున జరగనున్న తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 1982లో 43 ఏళ్ల క్రితం ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీకి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. మహనీయుల ఆశయాలు దశాబ్దాలు గడుస్తున్నా నెరవేరకపోవడంతో ఆ బాధ్యతను తన భుజాన వేసుకొని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. సంపద అందరికీ అందాలు.. ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదు.. అన్న ఉద్దేశంతో వస్తూనే రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి నిరుపేదల ఆకలి తీర్చారని గుర్తు చేశారు. తెలంగాణలో ఉన్న పేదరికాన్ని దృష్టిలో పెట్టుకొని అప్పటిదాకా ఉన్న పట్వారి, పటేల్ వ్యవస్థలను శాశ్వతంగా నిర్మూలించి మండల వ్యవస్థను తీసుకువచ్చారని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరికి విద్య అందాల అన్న ఉద్దేశంతో గురుకులాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆయన హయాంలో వెనకబడిన వర్గాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఆయన అధికారంలోకి వచ్చాకనే తెలంగాణలో పాత పరిస్థితి మతవివాదాలు, రాయలసీమలో ఓటు హక్కు దుర్వినియోగం వంటివి దూరమయ్యాయి అని గుర్తు చేశారు. దేశంలో ఎవరైనా సరే పార్టీ మారాలంటే పదవిని వదులుకోవాలని సంస్కృతిని ఎన్టీ రామారావు తీసుకువచ్చారని గుర్తు చేశారు. జనతా వస్త్రాలు, పక్కా గృహాల నిర్మాణాల వంటి ఎన్నో కార్యక్రమాలకు తెలుగుదేశం ప్రాణం పోసిందని అన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉందని అన్నారు.




**అన్న మార్గంలో బాబు..**
అన్నగా అందరి ఆదరాభిమానాలు త్వరగా ఉన్న ఎన్టీఆర్ మార్గంలోనే చంద్రబాబు ముందుకు ప్రయాణం చేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా పాలకులే ప్రజల వద్దకు వచ్చేలా ఏర్పాటు చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు ద్వారా విద్యార్థుల ఆకలి తీర్చి చదువుల దిశగా వారిని విజయవంతంగా ముందుకు నడిపారని అన్నారు. సచివాలయంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న ఫైళ్లను ప్రతి శాఖ కార్యాలయానికి వెళ్లి పరిష్కరించిన ఘనత చంద్రబాబు నాయుడు దేనిని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీకి ఇప్పటికీ తెలంగాణలో 1,75,000 సభ్యత్వం ఉందని, ఇందులో 50,000 పాత సభ్యులు ఉండగా మిగతావన్నీ యువకులు పార్టీలో చేరడం ద్వారా పెరిగాయని వెల్లడించారు. అటు ఎన్టీఆర్ ఆశయాలను, చంద్రబాబు ఆశయాలను తెలంగాణలో విజయవంతంగా ముందుకు నడిపేలా అంకితభావంతో కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**రేవంత్ రెడ్డి పై కీలక వ్యాఖ్యలు**
ప్రస్తుతం మూసి నదిగా పిలవబడుతున్న ఈ నది ఒకప్పుడు ముచుకుందా నది.. ఈ నదిని ప్రక్షాళన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని, వ్యక్తిగతంగా ఈ విషయంలో ఆయనకు మద్దతు పలుకుతున్నానని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన్నారు. పార్టీ సిద్ధాంతాలు వేరైనా ఈ అభిప్రాయాలు ఎవరి ఉన్న తాను మాత్రం రేవంత్ రెడ్డిని ఈ విషయంలో సమర్థిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే బక్కని స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో నేతలు అన్మారి వెంకటయ్య, కుమార్ గౌడ్,గంధం ఆనంద్,అంజయ్య,భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలు,కార్మికులకు అన్యాయం చేసిన రాష్ట్ర బడ్జెట్ షాపూర్ నగర్‌లో సిఐటియు నిరసన

- **పేదలకు అన్యాయం చేసిన బడ్జెట్:సిఐటియు**
- **గ్యారెంటీలు గాలి లో... ప్రజలు కష్టాల్లో!**

**కుత్బుల్లాపూర్ మార్చి 22 (ప్రజాక్షేత్రం):**
షాపూర్ నగర్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో షాపూర్ నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ రంగాలకు భారీగా నిధుల కోత విధించారని విమర్శించారు. రూ.3,24,233 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ గత ఏడాది రూ.3,04,000 కోట్లకు పైగా ప్రతిపాదించిన బడ్జెట్‌లో దాదాపు రూ.26 వేల కోట్లు ఖర్చు చేయలేదని, ప్రస్తుత బడ్జెట్ కూడా అదే పరిస్థితిని ప్రతిబింబిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు స్పష్టమైన ప్రతిపాదనలు లేవని, రైతు భరోసా పథకానికి రూ.25 వేల కోట్లు అవసరమైతే కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఇవ్వాలనే హామీపై కూడా బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పైగా ఇళ్లులేని పరిస్థితి ఉన్నప్పటికీ గృహ నిర్మాణానికి కేవలం రూ.5,500 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది సరిపోదని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే గృహ నిర్మాణ రంగానికి రూ.1,344 కోట్లు,విద్యుత్ రంగానికి రూ.326 కోట్లు తగ్గించారని విమర్శించారు. అదే విధంగా మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు,ఎస్సీ,ఎస్టీల సంక్షేమానికి తగిన కేటాయింపులు లేవని అన్నారు.దళిత బంధు కింద పెంపు హామీ ఇచ్చినా బడ్జెట్‌లో కనీస ప్రస్తావన కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉపాధి,నిరుద్యోగ భృతి వంటి అంశాలు పూర్తిగా విస్మరించబడ్డాయని, విద్యా,వైద్య రంగాల్లో ప్రైవేటీకరణను అరికట్టాలంటే ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసే విధంగా మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం,ఉపాధి అవకాశాల మెరుగుదలకు,దళితులు, గిరిజనులు,బలహీన వర్గాలు, మైనారిటీల సంక్షేమానికి తగిన నిధులు పెంచాలని సిఐటియు నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పసుల అంజయ్య, శ్రీశైలం,స్వాతి,యాదవ రెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.



# స్వచ్ఛత కోసం కదిలిన గాజులరామారం సర్కిల్ అధికారులు

- **"గాజులరామారం సర్కిల్‌లో "స్వచ్ఛ్ సండే" విజయవంతం**
- **బంధం చెరువు నుంచి చిత్తల్ చెరువు వరకు పరిశుభ్రత పనులు**

**కుత్బుల్లాపూర్ మార్చి 22 (ప్రజాక్షేత్రం):**
గాజులరామారం సర్కిల్ పరిధిలో 99 రోజుల ప్రజా పరిపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 17వ రోజు "స్వచ్ఛ్ సండే – సరస్సుల శుభ్రత కార్యక్రమం"ను ఆదివారం ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించారు. సరస్సుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా మరియు ఆరోగ్యకరంగా ఉంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా కొనసాగింది. ఈ కార్యక్రమం గాజులరామారం పరిధిలోని






బంధం చెరువు, చిన్న బంధం, కల్మాని కుంట, చిత్తల్ చెరువు వంటి పలు సరస్సుల్లో చేపట్టారు. శానిటేషన్ సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్ (RPs), స్థానిక ప్రజలు సమన్వయంతో పనిచేస్తూ చెత్తను తొలగించి, సరస్సుల పరిసరాలను శుభ్రపరిచారు.ప్రజలు స్వచ్ఛతను తమ బాధ్యతగా భావించి ముందుకు రావాలని అధికారులు పిలుపునిచ్చారు.

**గాజులరామారం సర్కిల్ లో ఆస్తిపన్నుపై విశేష స్పందన**
అదే సమయంలో గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్ను ప్రత్యేక కార్యక్రమం కూడా నిర్వహించగా, పన్ను చెల్లింపుదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (SWM) నిఖిల్ రెడ్డి పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

# బాన్సువాడలో ఉచిత వైద్య శిబిరం
# ప్రజలకు బిపి షుగర్ పరీక్షలు

**కామారెడ్డి జిల్లా మార్చి 22 (ప్రజాక్షేత్రం):**
బాన్సువాడ సంగమేశ్వర కాలనీలో ఆదివారం 7వ వార్డు బీజేపీ కౌన్సిలర్ మానస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా సలహాలు అందించారు. ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్,మోహన్, ప్రమోద్, సుధాకర్,మహేందర్ తదితరులు



# బీఆర్ఎస్ నాయకుడి ఇంట విషాదం





**అశ్వారావుపేట,మార్చి 22 (ప్రజాక్షేత్రం)**
మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంక ప్రసాద్ మాతృమూర్తి వరలక్ష్మి కన్నుమూశారు. వారి పార్థివదేహానికి అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో యుఎస్ ప్రకాశ్ రావు,మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్ మూర్తి,మోహన్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సంపూర్ణ,జజ్జురవరపు శ్రీరామ్ మూర్తి,సొమ్ము, వెంకటేశ్వరరావు,ఆరేపల్లి గోవింద్,మోటూరి మోహన్, నవీన్,మణికంఠ,దొడ్డ నాగేశ్వరరావు,బాల శ్రీను,దొడ్డ శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్‌లో బీజేపీ బలోపేతంపై కీలక భేటీ

- **పార్టీ కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్న సతీష్**

**కుత్బుల్లాపూర్ మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలోపేతంపై కీలక చర్చలు జరిగాయి. ఆకుల సతీష్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా కుత్బుల్లాపూర్‌లో పార్టీ స్థితిగతులు,కార్యకర్తల చురుకుదనం పెంపు,స్థానిక స్థాయిలో పార్టీ బలోపేతం వంటి అంశాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం కోరుతూ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నప్పటికీ, ఇకపై పూర్తి స్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలో బీజేపీని మరింత బలంగా నిలబెట్టేందుకు తమ వంతు పాత్ర పోషిస్తామని స్పష్టం చేశారు. పార్టీ నాయకత్వం నుంచి మార్గదర్శకత్వం, అవకాశాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డితో చర్చించి, తిరిగి పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేందుకు సహకరించాలని రాష్ట్ర అధ్యక్షులను కోరారు. స్థానిక కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ బలం పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీనిపై స్పందించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, ఈ విషయాన్ని సానుకూలంగా పరిగణిస్తున్నామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జితో చర్చించి, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలనుకునే ప్రతి కార్యకర్తకు అవకాశాలు కల్పించడం బీజేపీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ భేటీతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీలో పులి బాలరాం,కంది శ్రీరాములు,భీమరాజ్,అరుణ్ రావు,సువాసిని శక్తి, కవితా రెడ్డి, హరీష్ నాయుడు,మాధవులు, లానా,రమేష్ వేముల,వేణు గౌడ్, కవిత,సుహాసిని,అరుణ్ రావు మురళి,నల్ల జై శంకర్ గౌడ్,అంకం సతీష్,పాండు,మురళి తదితరులు పాల్గొన్నారు.



# రబీ పంటల్లో డ్రోన్ వినియోగంతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

- **సోంపల్లి ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి ముందడుగు**

**బూర్గంపాడు,మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఇతర రైతులకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోత్సాహం, వ్యవసాయశాఖ సహకారంతో రబీ పంట సాగులో డ్రోన్ సాంకేతికతను వినియోగించి విత్తనాలు వెదజల్లే కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు.మండలంలో తొలిసారిగా డ్రోన్ ద్వారా విత్తనాల పంపిణీ చేపట్టడం విశేషం. గత జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది.ఆధునిక సాంకేతికతతో పాటు అదనపు ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. పామాయిల్, ములగా సాగు, కొర్రమీను, బాతుల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు.ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ టి. భరత్ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందని అన్నారు. డ్రోన్ వినియోగం ద్వారా విత్తనాల వెదజల్లడం మాత్రమే కాకుండా ఎరువులు, మందులు పిచికారి వంటి పనులను సులభంగా నిర్వహించవచ్చని తెలిపారు.వ్యవసాయశాఖ ఏడిఏ తాతారావు మాట్లాడుతూ,వ్యవసాయాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు పెంచుకోవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 10 వ్యవసాయ డ్రోన్లను మంజూరు చేసినట్లు తెలిపారు.ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి మాట్లాడుతూ, కలెక్టర్ సూచనలు, కృషి విజ్ఞాన కేంద్రం మరియు వ్యవసాయశాఖ సలహాలతో నూతన సాంకేతికతను అనుసరిస్తూ అధిక దిగుబడులు,లాభాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఇతర రైతులు కూడా ఆధునిక పద్ధతులను స్వీకరించి పురోగమించాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఎవరి లాభం కోసం నామమాత్రపు చర్యలు









- **అక్రమ షెడ్లలో కంపెనీల కార్యకలాపాలకు సన్నాహాలు**
- **ఇది యాక్షన్ కాదు...కేవలం చూపు కోసం చేసిన నాటకం!**
- **ఇదేనా చర్యల తీరు.... అధికారులపై మండిపడుతున్న స్థానికులు**

**కుత్బుల్లాపూర్,మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లి న్యూ స్టీల్ సిటీలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు తీవ్ర అనుమానాలకు దారితీస్తున్నాయి. ఇటీవల చేపట్టిన చర్యలు కేవలం నామమాత్రంగానే మిగిలిపోయాయన్న ఆరోపణలు స్థానికుల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు తాత్కాలికంగా స్పందించినప్పటికీ, అది కేవలం చూపు కోసం చేసిన చర్యలా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు వెళ్లిన మరుసటి రోజే నిర్మాణ పనులు యథావిధిగా తిరిగి ప్రారంభం కావడం, అధికారుల చర్యలపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. మొత్తం ఐదు అక్రమ షెడ్ నిర్మాణాలు జరుగుతుండగా, కేవలం మూడు నిర్మాణాలపైనే పరిమిత చర్యలు తీసుకోవడం వెనుక కారణాలు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. మిగతా నిర్మాణాలు ఎటువంటి అడ్డంకులు లేకుండా కొనసాగుతుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసిన అక్రమ షెడ్లలో త్వరలోనే కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో, "ఇది నిజమైన చర్యలేనా? లేక సెటిల్‌మెంట్‌ల కోసం చేసిన నాటకమా?" అన్న సందేహాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ నామమాత్రపు చర్యలు పై అధికారులకు నివేదికలు చూపించడానికే పరిమితమయ్యాయా? లేక వీటి వెనుక మరెవరైనా ప్రభావం ఉందా? అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. దూలపల్లి న్యూ స్టీల్ సిటీలో కొనసాగుతున్న అక్రమ షెడ్ నిర్మాణాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని,పూర్తిగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఈ సమస్యపై పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపట్టే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.

## రాత్రిపూట కొడిచర్ల సరిహద్దు నుండి సిర్పూర్ మీదుగా ట్రాక్టర్లతో అక్రమ ఇసుక రవాణా పట్టించుకోని అధికారులు

**పోతంగల్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో కొడిచర్ల గ్రామ శివారులో సరిహద్దు ప్రాంతం నుండి సిర్పూర్ మీదుగా రాత్రి వేళల్లో 30 ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న సిర్పూర్ ట్రాక్టర్ యజమానులు సమయం రాత్రి అయితే చాలు ట్రాక్టర్లతో జోరుగా మదునూర్ మండల వైపు ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నాయని సమాచారం ఇచ్చిన కూడా పట్టించుకోని అధికారులు కోడిచెర్ల మందిర సరిహద్దు నుండి అతికలోడుతో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నందని సిర్పూర్ గ్రామస్తులు తెలియజేశారు.అధికారులకు ఫోన్ చేస్తే స్పందన వస్తలేదని ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ ఇసుక రవాణా ఆపాలని ప్రజలు కోరుతున్నారు.



## వార్డు సభ్యులు పొట్లూరి ఆనంద్ పరామర్శించిన పోచారం

**కామారెడ్డి జిల్లా మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో బీర్కూర్ మండల మాజీ ఎంపీపీ తిలకేశ్వరి రఘు బీర్కూర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పొట్లూరి ఆనంద్ పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి గత కొన్ని రోజుల క్రితం బీర్కూర్ మండల మాజీ ఎంపీపీ తిలకేశ్వరి రఘు కుమారుడు తిలకేశ్వరి రమాకాంత్ స్వర్గస్తులైనారు, ఈరోజు బీర్కూర్ లోని ఇంటికి వెళ్లి తిలకేశ్వరి రఘు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ,తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. అనంతరం బీర్కూర్ గ్రామ పంచాయతీ ప్రకాశరావు క్యాంపు పొట్లూరి ఆనంద్ కుమారుడు పొట్లూరి లలిత్ ఆర్యన్ మరణించడంతో ఈరోజు దశదిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల నాయకులు ,ప్రజాప్రతినిధులు పోచారం వెంట ఉన్నారు.



## మాజీ జెడ్పిటిసి శంకర్ ను పరామర్శించిన జహీరాబాద్ మాజీ ఎంపీ బీ బి పటేల్

**కోటగిరి మార్చి 22(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ కోటగిరి మండలం మాజీ జడ్పిటీసీ,మాజీ ఎంపీపీ హెగ్డోలీ గ్రామం పుప్పాల శంకర్ నీ ఆదివారం పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర మాజీ ఎంపీ బీబీ పాటిల్ పుప్పాల శంకర్ గారి ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు.దీంతో ఆయనను దైర్యం చెప్పారు.



## పోచమ్మ చెరువు తూమును ధ్వంసం చేసిన గుర్తు తెలియని దొంగలు

- **తూము ద్వారా వృథాగా పోయిన చెరువు నీరు.**
- **తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని ఆపిన సర్పంచ్ బోయిని రమేష్**

**చిగురుమామిడి,మార్చి 22 (ప్రజాక్షేత్రం)**

మండలంలోని ముదిమణిక్యం గ్రామంలోని పోచమ్మ చెరువు తుమును శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గేట్ మొత్తం పైకి ఎత్తి వేసి ధ్వంసం చేశారని,తూము చాలా ప్రమాదకరంగా ఉందని ముదిమాణిక్యం గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ తెలిపాడు .గ్రామంలో ఇలా దొంగతనాలు జరగడం,ధ్వంసం చేయడం లాంటి వ్యవస్థ ఉండటం చాలా బాధాకరం అన్నాడు .ఇట్టి విషయంపై ఇరిగేషన్ డీఈ కి,చిగురుమామిడి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.మోటర్ దొంగతనాలు విచ్చలవిడిగా గ్రామంలో జరుగుతున్నాయని గ్రామ ప్రజలుజాగ్రత్తగా ఉండాలని,ఇలాంటి దొంగల వ్యవస్థను రూపుమాపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సర్పంచ్ కోరాడు.






# 51 జి ఓ ను రద్దు చేసి సీనియారిటీ కార్మికులను తొలగించకుండా విధుల్లోకి తీసుకోవాలి

- **సీపీఐ ఎం ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా.గోపన్న**

**కొత్తగూడ మార్చి 22( ప్రజాక్షేత్రం ):.**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం లోని కా,, పాలడుగు కృష్ణ స్మారక భవనంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ సంస్థ అయిన అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టీ యూ) లో తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయితీ మున్సిపాల్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఐ ఎఫ్ టీ యూ జిల్లా కార్యవర్గ సభ్యులు కా,, గుగిల్ల వెంకన్న మరియు గ్రామ పంచాయితీ కార్మికులు ఈ శ్రీనివాస్ మండల కార్యదర్శి, పి జాంపయ్య, వి పాపయ్య, బి అశోక్, ఈ సందీఫ్ వి కృష్ణ ప్రసాద్, జడి వెంకటేష్ కారోబార్, కే నాగేశ్వరరావు, టీ ప్రవీణ్ కుమార్, గుండె శ్రీను తదితర కార్మికులకు సీపీఐ ఎం ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కా,, గోపన్న ఆధ్వర్యంలో వై కే గ్రూపు నుండి చేరారు. కా,, గోపన్న మాట్లాడుతూ.. సామాజిక భద్రత,ఉపాధి, ఉద్యోగ భద్రతల కోసం ఐక్యంగా పోరాడాలి. 8గంటల పని దినం పరిరక్షణకు ఉద్యమించాలి. కనీస వేతనం, సమన పనికి సమనవేతననికై పోరాడాలి. 51 Go ను రద్దు చేయాలి.సీనియారిటీ కార్మికులను తొలగించకుండా విధుల్లోకి తీసుకోవాలని మండల ఎంపిడిఓ అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యూ జిల్లా నాయకులు పసునూరి రాజ మల్లు,ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ద బోయిన జీవన్,ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా నాయకులు జిట్టబోయిన రామ చంద్రు,పి వై ఎల్ జిల్లా నాయకులు కావాళ్లపు సాంబ రాజు,చల్లా మహేందర్, కాసార్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం.

**వనపర్తి,మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

స్థానిక 31 వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై గృహప్రవేశం చేసిన దంపతులను అభినందించారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధు, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ బండారు విజయలక్ష్మి రాధాకృష్ణ పాల్గొన్నారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందిస్తున్న సహాయంపై హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు,వార్డు ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



# విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు

**చిగురుమామిడి,మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

చిగురుమామిడి మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో బోనాలతో పెద్ద ఎత్తున డప్పు సప్పులతో పోచమ్మకు ఆదివారం బోనాలు సమర్పించారు. తెలుగు నూతన సంవత్సరము పురస్కరించుకొని, గ్రామంలో మంచి వర్షాలు కురవాలని పంటలు మంచిగా పండాలని కోరుతూ పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గొల్లపల్లి సదాచారి,అనువోజు చిరంజీవి, పోలోజు సదాచారి,పోలోజు స్వతంత్ర చారి,అనువోజు రాజు,అణువోజు రాములు, పోలోజు రమేష్,పోలోజు వెంకటరమణ,పోలోజు ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలు పాటించకుండా ఎయిర్టెల్ నెట్వర్క్ కేబుల్ తవ్వకాలు పైప్ లైన్ లేకేజ్





- **తవ్వకాల వల్ల పైప్ లైన్ లీకేజ్ తో నీటి అంతరాయం..**
- **నర్సంపేట మున్సిపల్ చైర్పర్సన్ ఆగ్రహం**

**నర్సంపేట మార్చి 22(ప్రజాక్షేత్రం):**

నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ మెయిన్ రోడ్డు,ద్వారక పేట మెయిన్ రోడ్డు నందు ఎలాంటి అనుమతులు లేకుండా ఎయిర్టెల్ నెట్వర్క్ వారు భారీ వైబ్రేటర్ మిషన్ వాహనంతో కేబుల్స్ వేసేందుకు తవ్వకాలు జరపడం జరిగింది. అనుమతి లేకుండా,నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను తవ్వడం వల్ల వాటర్ పైప్లైన్ పలిగిపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ నుండి సరైన అనుమతి తీసుకోకుండా రాత్రికి రాత్రే తవ్వకాలు జరపడం సరైనది కాదు అంటూ మున్సిపల్ చైర్ పర్సన్ మండిపడ్డారు.పగిలిన పైప్ లైన్లను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు జరిపిన ఎయిర్టెల్ నెట్వర్క్ యాజమాన్యంపై మున్సిపల్ చైర్ పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేసి వారిపై పల్లు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయించడం జరిగింది. ఇకముందు మిషన్లతో తవ్వకాలు జరపకూడదని ప్రవేట్ సిబ్బంది చేతే పనులు చేయించాలని వారు హెచ్చరించారు.రేపటిలోగా దెబ్బతిన్న పైప్లైన్లకు మరమ్మతులు పూర్తి చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్స్ బీరం భరత్ రెడ్డి,హనుమకొండ శ్రీధర్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనీషా ప్రకాష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాట ప్రభాకర్,కీసర వెంకటేశ్వర్లు,కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మెరుగు కిరణ్,ఉప్పుల శాలూమ్,దేవోజ్ హేమంత్,చీకటి శివమణి,మున్సిపల్ టౌన్ వాటర్ లైన్ ఇంచార్జ్ కాట శ్రీను,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# షాహిద్ దివాస్: కామారెడ్డిలో స్వతంత్ర్య సమరయోధుల స్మరణతో శ్రమదానం







**కామారెడ్డి జిల్లా మార్చి 22 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో బీర్కూర్ మండల కేంద్రాల్లో షాహిద్ దివాస్ సందర్భంగా శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది త్యాగధనులు తమ విలువైన ప్రాణాలను త్యాగం చేశారు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన సౌర్యాన్ని నిబద్ధతను గౌరవిస్తూ జ్ఞాపకార్ధంగా నిర్వహించేదే ఈ షాహిద్ దివాస్ స్వాతంత్ర పోరాటంలో అమరులైన కామ్రేడ్ భగత్ సింగ్,రాజ్ గురు ,సుఖ్ దేవ్ ల పోరాటాలను గుర్తుకు చేసుకొని శ్రమదానం చేశారు కామ్రేడ్ భగత్ సింగ్,నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని నీళ్లతో శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు ఎస్ జిల్లా అధ్యక్షులు యన్. బాలరాజ్ బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ వార్డు మెంబర్ నవీన్ గ్రామ యువకులు వెంకట్,బాలకృష్ణ, రమేష్, కోర్రి కృష్ణ,సురేష్,గంగాధర్, పోశెట్టి,పి డి ఎస్ యు నాయకులు సాయికుమార్, శేఖర్, విహాన్ లు పాల్గొనడం జరిగింది.


**బాన్సువాడలో షాహిద్ దివాస్: భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ లకు నివాళులు**

బాన్సువాడ పట్టణంలో కేంద్రాల్లో షాహిద్ దివాస్ సందర్భంగా శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది త్యాగధనులు తమ విలువైన ప్రాణాలను త్యాగం చేశారు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన వారి సౌర్యాన్ని నిబద్ధతను గౌరవిస్తూ జ్ఞాపకార్ధంగా నిర్వహించేదే ఈ షాహిద్ దివాస్ స్వాతంత్ర పోరాటంలో అమరులైన కామ్రేడ్ భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల పోరాటాలను గుర్తుకు చేసుకొని శ్రమదానం చేశారు కామ్రేడ్ భగత్ సింగ్,నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని నీళ్లతో శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాన్సువాడ లో పోల్కం గోపాల్,చిదర సాయిలు, సమల శ్రీకాంత్ కౌన్సిలర్,ఓట్లంగారి హనుమాన్లు,తలారి భాస్కర్, శ్రీరామ్,మహేందర్ శివ,మహేందర్,భూమేష్ ,కొండని గంగారం తదితరులు పాల్గొన్నారు....

# వట్టినాగులపల్లి లో దోమల బెడద తీవ్రత...

- **అధికారులకు పట్టింపు ఉండదా...?**
- **ప్రజల సమస్యలను పరిష్కరించాలి.**

**రాజేంద్రనగర్, మార్చి 22(ప్రజాక్షేత్రం)**



రంగారెడ్డి జిల్లా నార్సింగి సర్కిల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వట్టి నాగులపల్లి లో దోమల బెడద తీవ్రత తో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. అధికారులకు పట్టింపు ఉండదా అని ప్రశ్నించారు. వేసవి కాలం ఉక్క పోత, పైగా దోమల దండయాత్ర, ఈ దోమల తీవ్రతతో డెంగ్యూ, మలేరియా, జ్వరాలతో రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. కనీసం దోమల నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులకు హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోయారు. అసలు దోమల నివారణ చర్యలకు స్ప్రే కానీ, పాగింగ్ కానీ ఎప్పుడు ప్రారంభిస్తారో... ఎప్పుడు నిలిపివేస్తారో కూడా తెలియదు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని దోమల నివారణ చర్యలకు ప్రతి వీధి, వీధికి దోమల స్ప్రే గాని పాగింగ్, కానీ చేసి దోమల బెడద నుంచి కాపాడాలని గ్రామ ప్రజలు అధికారులను కోరారు.

# ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య

**రాజేంద్రనగర్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**



ఉద్యోగం రాలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. అత్తాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా... తూర్పు తాండ, వనపర్తి చిట్యాల ప్రాంతానికి చెందిన సిద్ధార్థ హైదరాబాద్ శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో ఇంట్లో సమయంలో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. సిద్ధార్థ ఎవరితో గొడవలు పెట్టుకునే వ్యక్తి కాదని ఎప్పుడు ఉద్యోగం గురించే ఆలోచించేవాడని మృతుడి తమ్ముడు తెలిపారు. ఉద్యోగం రాకపోవడం వలన ఈ తీవ్ర నిర్ణయం తీసుకొని ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంక కొన్ని రోజుల్లోనే సిద్ధార్థ కు పెళ్లి నిశ్చయమైందని, ఇంతలోనే ఈ దుర్ఘటన జరగడంతో కుటుంబన్నీ తీవ్ర విషాదంలో కన్నీరు మున్నీరయ్యారు. అత్తాపూర్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భగత్ సింగ్ ఆలోచనలు – మా మార్గదర్శకం.



- **క్రీడల ద్వారా యువత శక్తిని వెలికితీస్తాం.**
- **రక్తంలో దేశభక్తి – చేతుల్లో బ్యాట్**
- **భగత్ సింగ్ జ్ఞాపకార్ధం క్రికెట్ టోర్నమెంట్.**

**సదాశివపేట టౌన్,మార్చి 22(ప్రజాక్షేత్రం):**

సదాశివపేట పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ, యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మంచి క్రమశిక్షణను పెంపొందించుకోవాలని సూచించారు. ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగగా, పాల్గొన్న జట్ల క్రీడా నైపుణ్యాన్ని ఆయన అభినందించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు విజేత జట్టుకు ట్రోఫీ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పరాజిత జట్టును కూడా ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ 11 టీమ్ పై యు ఎస్ మైత్రి టీమ్ వారు 7 రన్స్ తేడాతోని విజయం సాధించారు. ఇట్టి కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యం, సిటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్,11 వార్డు కౌన్సిలర్ వైద్యం పవన్,పద్మశాలి నాయకుడు బామిని రవికుమార్, ఆధ్య హాస్పిటల్ అధినేత హరీష్ రెడ్డి పాల్గొన్నారు. డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి అనిల్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారందరికి ప్రతేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఊసు కారాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముజుబ్ మాస్టర్ ఆలమీన్ స్కూల్ కరస్పాండెంట్ ఎంఏ ఘని,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్ డివైఎఫ్ఐ నాయకులు మహేష్ చిన్న నవీన్ వెంకట్ రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా పాలన సభకు భారీగా తరలిన కాంగ్రెస్ నాయకులు

- **నర్మెటలో కాంగ్రెస్ శక్తి ప్రదర్శన మండలం నుంచి భారీ సమీకరణ**
- **ప్రజా పాలన సభతో నర్మెటలో రాజకీయ హోరు**

**పెద్ద కొడప్‌గల్ మార్చి 22(ప్రజాక్షేత్రం)**

కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలం సముద్ర తండా నుంచి సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన రైతు ఉత్సవాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్న సందర్భంగా మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో సభకు తరలి వెళ్లారు. తెల్లవారుజామునే ప్రత్యేక వాహనాల్లో బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు సభ స్థలానికి చేరుకొని ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న పథకాలపై సభలో చర్చించగా, వాటికి మద్దతుగా నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. సభ ప్రాంగణం మొత్తం కాంగ్రెస్ జెండాలతో నిండిపోవడంతో పాటు, నాయకులు నినాదాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. గ్రామాల వారీగా సమీకరించి వచ్చిన కార్యకర్తలు పార్టీ పట్ల తమ నిబద్ధతను చాటారు. ఈ సభ ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. సభకు హాజరైన వారిలో మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరా బాయ్, పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు మరియు గ్రామస్తులు ఉన్నారు. సభ విజయవంతం కావడంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రెస్ రిపోర్టర్లను అని చెప్పి దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేసిన వారిపై కేసు నమోదు

- **షాద్ నగర్ పట్టణ సీఐ సీతారాం వెల్లడి**

**షాద్ నగర్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**




రిపోర్టర్లు మంటూ బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. పట్టణ సిఐ కె సీతారాం వెల్లడించిన ప్రకారం ఆదివారం నాడు ఫిర్యాదు గంగ బియాన్ అనే అతను పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేసినది ఏమనగా విట్యాల గ్రామ పరిధిలోని పొలంలోని గుట్టాను చదును చేయమని అట్టి భూమి యాజమాన్యం వారికి తెలుపగా వారు తేదీ 22.3.2026 నాడు అట్టి ప్రాంతంలో పొలంలోని గుట్టాను చదును చేయగా మిగిలిన మట్టిని వారి యొక్క టిప్పర్లలో తీసుకుని షాద్నగర్ వైపు వెళుతుండగా మార్గం మధ్యలో పీర్లగూడ దగ్గర రాగానే రెండు బైకులు పై వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా వచ్చి వారి యొక్క టిప్పర్లను ఆపినారు అంతటితో ఆగకుండా వారు ప్రెస్ ఆంధ్రజ్యోతి డిపార్ట్మెంట్ వారము అని వాటి టిప్పర్ డ్రైవర్లను బెదిరించి వారి దగ్గర నుంచి 20,000 డిమాండ్ చేసినారు అటు డబ్బులు వారి దగ్గర లేవని చెప్పిన వినకుండా టిప్పర్ డ్రైవర్లను బూతులు తిట్టి చేతులతో కొట్టడమే కాకుండా వారి దగ్గర ఉన్న 5,500 లాక్కోవడం జరిగినది దాంతో టిప్పర్ డ్రైవర్లు వారి యాజమానికి విషయం తెలుపుతుండగా అట్టి వ్యక్తులలో ఒక వ్యక్తి అట్టి ఫోన్ లాక్కొని వాళ్ళు ప్రెస్ వాళ్ళమని బండిని సీజ్ చేస్తామని చెప్పి బెదిరించి ఆ టిప్పర్ ని అక్కడి నుండి ఒక తెలియని ప్రదేశం లోపలికి తీసుకొని వెళ్లి అటు 20,000 ను ఫోన్ పే చేస్తేనే టిప్పర్లను వదులుతామని చెప్పి దొరకకుండా ఇబ్బంది పెట్టినారు. అట్టి వ్యక్తుల పేర్లు రాజు యాదవ్, జంగయ్య అలియాస్ జగన్ అని తెలిసినదనీ పై ఫిర్యాదు పై షాద్ నగర్ పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడలతో నూతన ఉత్తేజం : భీమ్ భరత్

**మొయినాబాద్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామంలో శంకర్ గౌడ్ వారి నాన్న జ్ఞాపకార్థం లింగం గౌడ్ మెమోరియల్ టోర్నమెంట్ ఫైనల్ కి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు TUFIDC చైర్మన్ చల్ల నరసింహ రెడ్డి మరియు చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ మరియు వారి సతీమణి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ పాల్గొని బహుమతులు అందేజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారు కూడా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో ముందుకు సాగాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు అనేవి సహజంగా జరుగుతుంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య, చేవెళ్ళ లేబర్ సెల్ అధ్యక్షులు వసీం, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు శ్రీశైలం, వైస్ చైర్మన్ చిలుకూరు రాజు, విఠల్ యాదవ్ పాల్గొన్నారు.



# ఈనెల 29 అంబేద్కర్ పూలే విగ్రహావిష్కరణ

- **మహనీయుల విగ్రహ ఆవిష్కరణ సభను జయప్రదం చేయండి**
- **ఎమ్మార్పీఎస్ రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నర్సింహా మాదిగ**

**షాద్ నగర్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

ఈసందర్భంగా అయన మాట్లాడుతు ఈనెల 29 న పార్వతపూర్ లో జరిగే మహనీయుల విగ్రహా ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమనికి ప్రజాశమిక వదులు మేధావులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలి అని పెర్గోన్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ విచ్చేయుచున్నారు. విశిష్ట అతిధి షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ఈ సందర్భంగా ఆదివారం వి కేఫ్ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో మహనీయుల ఏర్పాటు అధ్యక్షులు మీదికేరి రాధా కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 29 న పార్వతపూర్ గ్రామంలో జరిగింది మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ నుషాద్ నగర్ మహాత్మ జ్యోతి రావు పూలె అంబేద్కర్ వదులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చెయ్యాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ బుద్దోళ్ల మల్లేష్ గౌడ్, స్థానిక ఎమ్మార్పీఎస్ కొందుర్గ్ మండల అధ్యక్షులు ఆనేగాళ్ళ ఆనంద్ మాదిగ, తుప్పరి రవి, ఏళ్ళ



రాజు, అరేందర్, ప్రవీణ్, కృష్ణ ప్రసాద్, ప్రేమ్ కుమార్, శ్యామ్ సుందర్, జయరాములు, శ్రీనివాస్, కృష్ణ, మహేష్, మరియు వివిధ ప్రజా సంఘాలు నాయకులు పాల్గొని ఈ సందర్భంగా 29న జరిగే మహనీయుల విగ్రహావిష్కరణ సభకు విద్యార్థులు యువజన సంఘాలు ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మిక కర్షకులు ప్రజలు ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలనికోరడం జరిగింది. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ హాయంలో నిరుపేదలకు ఇల్లు

- **చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య వెల్లడి.**
- **బి ఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో ప్రజలు అనేక కష్టాలు పడ్డారు.**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 22(ప్రజాక్షేత్రం):షాబాద్ మండల పరిధిలోని చందన్వెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు తలారి లక్ష్మమ్మ గృహప్రవేశానికి ఆదివారం, విచ్చేసిన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, గుడిమల్కాపూర్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ తదితరులు చందనవెల్లి గ్రామాన్నికి విచ్చేసి నూతనంగా ఏర్పాటు చేసిన ఇల్లు ను చందన వెల్లి సర్పంచ్ నవనీత స్వామి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గ్రంథాలయ చైర్మన్ ఎలిగంటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుపేదలు అనేక కష్టాలు పడ్డారని ప్రభుత్వ హాయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలు ఇచ్చిన హామీలను భాగంగా పేద ప్రజలకు కనీసం ఉండడానికి ఇల్లు కట్టించిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి దేనని ఆయన స్పష్టం చేశారు. అనంతరం గుడిమల్కాపూర్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్



ప్రభుత్వ హాయంలో పేద ప్రజలకు కనీసం ఉండడానికి ఇల్లు కట్టించిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి దేనని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రుద్రారం సర్పంచ్ యాది రెడ్డి, గ్రామం గ్రామం ఉపసర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు శ్రీహరి, వెంకటేష్ శిరీష, రాఘవ చారి, గీత యాదయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడీల కిష్టయ్య, రాజ మల్ల మహేందర్ రెడ్డి, అప్పలి కిష్టయ్య, వెంకటయ్య, గిరిబాబు, సోమని శివ, ప్రవీణ్, అనసూయ, పుష్పమ్మ, చంద్రకళ, చందనవెల్లి గ్రామస్తులు ఇందిరమ్మ ఇల్లు 400 రోడ్డు ఫార్మేషన్ మట్టి రోడ్లు ప్రారంభించారు. కాంగ్రెస్ పేదల కల సహకారం జరిగిందని తెలియజేశారు.

## రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకున్న ముస్లిం సోదరులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 21(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో శనివారం రంజాన్ పవిత్ర మాసాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తిచేసుకుని రంజాన్ పండుగ ఆనందంగా జరుపుకుంటున్న సందర్భంగా పోతుగల్ గ్రామ సర్పంచ్ పామేన, నర్సింలు మరియు గ్రామ పెద్దలు జాకీర్ షరీఫ్, భార్గవ్ రామ్, పీరంపల్లి యాదయ్య, పోతుగల్ గ్రామ పెద్దలు,అందరూ కలిసి, గంగా.... జేమునీ, తహజిత్ స్ఫూర్తితో పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మునీర్, మైముద్, జోసెఫ్, మహేందర్, ప్రకాష్, రమేష్, రవి, శ్రీనివాస్లు పాల్గొన్నారు, ఈ సందర్భంగా



ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ పరస్పర ఐక్యత స్నేహభావంతో కలిసి జీవించాలనే సందేశాన్ని అందించారు, గ్రామంలో సార్వభౌభత్వం, సాహర్థం మరింత బలపడాలని అందరూ శాంతియుతంగా సుఖ సంతోషాలతో జీవించాలని ఆశించారు.

## వాసవి మాత పారాయణం గిన్నిస్ ఆఫ్ రికార్డ్

**రాజేంద్రనగర్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

వాసవి మాత పారాయణం గిన్నిస్ ఆఫ్ వార్డ్ రికార్డ్ గొప్ప దైవ కార్యక్రమానికి ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న వాసవి మాత దైవ కార్యక్రమానికి నార్సింగి మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ మణికొండ నుండి ఆర్య వైశ్య అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు ఐదు బస్సులు 20 కారులతో కూడిన బృందం 300 మందితో బయలుదేరి విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దైవభక్తితో ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుడు వేణుమాధవ్, మణికొండ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శి కోశాధికారి స్నేహ మహాలక్ష్మి దేవి ప్రియ, పుప్పాలగూడ ప్రధాన కార్యదర్శి దారం భానుచందర్ సభ్యులు మణికంఠ నరేష్ మల్లయ్య చంద్రశేఖర్ అశోక్ బ్రహ్మానందం రోజా శ్రీధర్ ఆవోపా మహిళా విభాగం ప్రవళిక, శరణ్య తదితరులు పాల్గొన్నారు.



## బంజారాహిల్స్‌లో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ హల్ చల్..!

- **హైదరాబాద్లోని బంజారాహిల్స్ లో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ హల్చల్.**
- **వివాదాస్పద స్థలంలోకి వచ్చి అనుచరులతో వీడియోలు తీయించిన ఎంపీ.**
- **ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వెనుక ఉన్న ఆనంద్ ప్రభాత్ సొసైటీలో ఘటన.**

**హైదరాబాద్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

ఏపీలోని అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ హైదరాబాద్‌లో కలకలం సృష్టించారు. నగరంలోని బంజారాహిల్స్‌లో ఉన్న ఓ వివాదాస్పద స్థలం వద్ద ఆయన హంగామా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

**వివరాల్లోకి వెళితే..**

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వెనుక ఉన్న ఆనంద్ ప్రభాత్ సొసైటీ స్థలంపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఆదివారం ఉదయం సీఎం రమేశ్ తన అనుచరులతో కలిసి ఈ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఉన్నవారిని ఉద్దేశిస్తూ, "వీడియో తీయ్" అంటూ తన సిబ్బందిని ఆదేశిస్తున్న దృశ్యాలు బయటకు వచ్చిన వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయన రాకతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ వివాదం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ వరకు చేరినట్లు సమాచారం. అయితే, సీఎం రమేశ్ ఆ స్థలానికి ఎందుకు వెళ్లారు? ఈ ఘటనపై ఎవరైనా ఫిర్యాదు చేశారా? అనే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



## శ్రీ రామచంద్ర కళ్యాణం ఉత్సవ పత్రికను అందజేసిన గ్రామ సర్పంచ్ పావని చెన్నయ్య.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 22(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెలలో జరిగే శ్రీ సీతారామ కళ్యాణం పత్రికను, ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భరత్ లకు పత్రికలను అందజేశారు. అదేవిధంగా నగరంలోని గుడిమల్కాపూర్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ నివాసంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ పత్రికను అందజేసినట్లు, సీతారాంపూర్, సర్పంచ్ తోపుకొండ పావని చెన్నయ్య, డాక్టర్ రాజు,



మని చించెట్టి, తెలుగు శివ, ముద్దంగుల రఘు, తదితరులు కలిసి నియోజకవర్గ



పూర ప్రాముఖ్యముకులకు పత్రికను అందజేసినట్లు సర్పంచ్ తోపకుండా పావని చిన్నయ్య ఆదివారం ప్రజాక్షేత్రం విలేకరికి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక కొంతమంది "స్థానికేతరులు" అడ్డంకులు సృష్టిస్తున్నారు.

- మంత్రి సీతక్క ఆగ్రహం
- కారుణ్య నియామక పత్రాలను అందజేసిన మంత్రి సీతక్క



**కొత్తగూడెం మార్చి 22(ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఐటీడీఏ గెస్ట్ హౌస్ లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కారుణ్య నియామక పత్రాలను అందజేసారు. ఐటీడీఏ పరిధిలో వివిధ కారణాలతో మృతి చెందిన 17 మంది ప్రభుత్వ ఉద్యోగుల మృతి చెందగా 3కుటుంబాల, లబ్ధిదారులకు మంత్రి స్వయంగా నియామక పత్రాలను అందజేశారు. విధి నిర్వహణలో ఉంటూ అకాల మరణం చెందిన ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో వారికి ఆసరాగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ కారుణ్య నియామకాలను చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన శాఖ డిప్యుటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్, పార్టీ నాయకులు పాలుగోన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంతమంది స్థానికేతరులు పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధిని అడ్డుకునే వారిని ప్రజలే అడ్డు తలిగే రోజు దూరంలో లేదని ఆమె హెచ్చరించారు.

## ఆసిఫాబాద్ దారుణం పత్తిచేనులో పసికందు...

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా మార్చి 22(ప్రజాక్షేత్రం):**



కాగజ్ నగర్ మండలం వల్లగొండ గ్రామ పంచాయతీ సీతానగర్ శివారులో పత్తి చేనులో పసికందును గుడ్డలో కట్టి పడేసిన ఘటన శనివారం కలకలం రేపింది. స్థానికులు ఉదయం పత్తి చేను వైపు వెళ్లగా శిశువు అరుపు వినిపించింది, అటు చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడకి చేరుకొని చేనులో సంచిలో చుట్టి పడేసి ఉన్న ఆడ శిశువును సురక్షితంగా బయటకు తీసి కాగజ్ నగర్ లోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించి ట్రీట్మెంట్ అందించారు. విషయాన్ని బాల సంరక్షణ అధికారి మహేశ్ కి తెలపడంతో సిబ్బందితో ఆయన చేరుకొని ఒక రోజు వయసున్న శిశువును బాల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు. కన్నపేగు బంధాన్ని తెంచుకుని కసాయిగా మారిన తల్లి ఆమె కుటుంబీకులను కర్కశత్వాన్ని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

## సీఎం మీటింగ్ భారీగా తరలివెళ్లిన రైతులు కాంగ్రెస్ శ్రేణులు

**ఖానాపూరం మార్చి 22(ప్రజాక్షేత్రం):**

ఖానాపురం మండల బుధరావుపేట గ్రామ నుండి భారీగా తరలి వెళ్లిన రైతులు కాంగ్రెస్ సేణులు బుధరావుపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా నర్మెట్టా గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన కానున్నారు నర్సంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ శ్రేణులు, రైతు సంఘాల నాయకులు, రైతులు మరియు అనుబంధ సంఘాల నాయకులు భారీగా తరలి వెళ్లడం జరిగింది







# బంకుల్లో నిల్'.. బ్లాక్‌లో 'ఫుల్'!

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

**మంగపేట, మార్చి22 ప్రజాక్షేత్రం**

మంగపేట మండలంలో గత కొన్ని రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర రూపం దాల్చింది. బంకులకు వెళ్లిన ప్రజలకు "స్టాక్ లేదు" అనే సమాధానం తప్ప మరొకటి లభించడం లేదు. అయితే ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌లో మాత్రం ఇంధనం లభ్యత పెరిగి, అది కూడా అధిక ధరలకు అమ్ముడవుతున్న పరిస్థితి స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ముడి చమురు సరఫరాలో అంతరాయం వంటి కారణాలతో ఇంధన కొరత ఏర్పడినప్పటికీ, స్థానికంగా జరుగుతున్న వ్యవహారాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బంకలలో అధికారికంగా "నిల్" అని చెప్పబడుతున్న ఇంధనం, బ్లాక్ మార్కెట్‌లో "ఫుల్"గా ఎలా లభ్యమవుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

స్థానికుల ఆరోపణల ప్రకారం.. కొంతమంది పెట్రోల్ బంక్ నిర్వాహకులు నేరుగా ఇతర వ్యాపారులకు ఇంధనాన్ని మళ్లించి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వినికిడి. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతుండగా,అక్రమ వ్యాపారులు లాభాలు గడిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక గృహ వినియోగానికి ఉద్దేశించిన వంట గ్యాస్ సిలిండర్ల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని సమాచారం. గృహ అవసరాల కోసం సిలిండర్లు అందుబాటులో లేకపోయినా, హోటళ్లు మరియు వ్యాపార రంగాల్లో మాత్రం విరివిగా వినియోగంలో ఉండటం గమనార్హం. ఇది స్పష్టంగా నిబంధనల ఉల్లంఘనగా భావిస్తున్న ప్రజలు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

సామాన్యులకు ఇంధనం దొరకక, బ్లాక్ మార్కెట్‌దారులు దోపిడీకి పాల్పడటం ఎంతవరకు సమంజసం?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే టాస్క్ ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగిపట్టి, బంకులపై అకస్మిక దాడులు నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలికి తీయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల నిత్య జీవితానికి అత్యవసరమైన ఇంధన సరఫరా విషయంలో ఇలాంటి అక్రమాలు కొనసాగితే, పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకుంటారా? లేక బ్లాక్ మార్కెట్ దందా ఇదేలా కొనసాగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం కోసం మంగపేట మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.



# తల్లి శవం వద్ద రాత్రంతా మూడేళ్ల చిన్నారి రోధన

- షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ దారుణ హత్య
- మృతురాలు రంగారెడ్డి గూడకు చెందిన పోతుల శోభారాణి
- నర్సింహులుతో శోభారాణికి వివాహేతర సంబంధం

**షాద్ నగర్, మార్చి 22(ప్రజాక్షేత్రం):**

నమ్మిన భర్త కాలయముడయ్యాడు.. కట్టుకున్న భార్య అని చూడకుండా అతి దారుణంగా ప్రాణాలు తీశాడు. అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారి, రాత్రంతా తల్లి శవం వద్దే రోదిస్తూ గడపడం స్థానికులను కన్నీరు పెట్టించింది. వివాహేతర సంబంధం ముసుగులో జరిగిన ఈ ఘాతుకం షాద్నగర్ పరిధిలోని రంగారెడ్డిగూడలో కలకలం రేపింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా రంగారెడ్డిగూడకు చెందిన శోభారాణి (30)కి, మహబూబ్ నగర్ జిల్లా కోయిలకొండకు చెందిన రాజుతో పదేళ్ల క్రితం వివాహమైంది. పదేళ్ల పాటు సాఫీగా సాగిన వీరి సంసారంలో నర్సింహులు అనే వ్యక్తి ప్రవేశించడంతో గొడవలు మొదలయ్యాయి. శోభారాణికి నర్సింహులుతో ఏర్పడిన వివాహేతర సంబంధం కారణంగా దంపతుల మధ్య మనస్పర్థలు తీవ్రమయ్యాయి. దీంతో నెల రోజుల క్రితం భర్తను వదిలి శోభారాణి పిల్లలతో సహా పుట్టింటికి వచ్చేసింది.

**అర్ధరాత్రి దారుణం.**

నర్సింహులు అనే వ్యక్తి శోభారాణిని పెళ్లి చేసుకుంటానని పెద్దల సమక్షంలో పట్టుబట్టడంతో ఆవేశానికి గురైన భర్త రాజు, ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. శనివారం రాత్రి అత్యంత దారుణంగా ఆమెను హత్య చేసి, రంగారెడ్డిగూడ తంగడపల్లి రహదారిలోని పొదల్లో పడేశాడు.

**కదిలించిన దృశ్యం.**

తల్లి మరణించిందన్న విషయం కూడా తెలియని ఆ మూడేళ్ల చిన్నారి, రాత్రంతా ఆ మృతదేహం వద్దే కూర్చుని ఏడుస్తూ గడపడం అందరినీ కలచివేసింది. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లే రైతులు ఈ దృశ్యాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న షాద్నగర్ ఇన్స్పెక్టర్ సీతారాం, ఎస్సై సుశీల మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



## అక్రమ ఇసుక రవాణా పట్టించుకోని అధికారులు

**పోతంగల్ మార్చి 22(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో కొడిచర్ల గ్రామ శివారులో సరిహద్దు ప్రాంతం నుండి సిర్పూర్ మీదుగా రాత్రి వేళల్లో 30 ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న సిర్పూర్ ట్రాక్టర్ యజమానులు సమయం రాత్రి అయితే చాలు ట్రాక్టర్లతో జోరుగా మదునూర్ మండల వైపు ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నాయని సమాచారం ఇచ్చిన కూడా పట్టించుకోని అధికారులు కోడిచెర్ల మందిర సరిహద్దు నుండి అతికలోడుతో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నందని సిర్పూర్ గ్రామస్తులు తెలియజేశారు. అధికారులకు ఫోన్ చేస్తే స్పందన వస్తలేదని ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ ఇసుక రవాణా ఆపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## నిర్దవెల్లి గ్రామంలో నూజివీడు సీడ్స్ రైతు క్షేత్ర ప్రదర్శన

**కేశంపేట, మార్చి 22(ప్రజాక్షేత్రం):**

కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామంలోని తోట వెంకటేశ్ పొలంలో ఆదివారం నూజివీడు సీడ్స్ వారి ఆధ్వర్యంలో NMH8413 విన్నర్ గోల్డ్ మొక్కజొన్న పంటపై అవగాహన నిర్వహించారు. విన్నర్ గోల్డ్ పంటతో వచ్చే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు టీఎస్ఎల్ జే నర్సింహులు, ఆర్ఎం రాములు, జెడ్ ఎం భరత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సీ భాస్కర్ గౌడ్ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## విద్య వల్లే వికాసం సాధ్యం

- చేవెళ్ల మండల ఎన్ ఎస్ యు ఐ కమిటీ సభ్యులు ఎండి సమీరుద్దీన్

**చేవెళ్ల, మార్చి 22(ప్రజాక్షేత్రం):**



విద్య వల్లే వికాసం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించాలని ఎన్ ఎస్ యు ఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యులు ఎండి సమీరుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన లో తెలుపుతూ.. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాశాఖలో చేస్తున్న సమూల మార్పుల వల్ల విద్యార్థులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. బడ్జెట్ లోనూ విద్యా శాఖ కు అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, సకల సౌకర్యాలతో ఉచితంగా అందిస్తున్న విద్యను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/26/A2094